# ప్రొలోగుయ్-మోనోలోగుయ్

"నువ్వు రాసేవన్నీ కథలు కావు" నల్లటివన్నీ నీళ్ళు కాదు అన్నంత సులువుగా అన్నాడు సుబ్బారావ్.

నల్లటివన్నీ నీళ్ళు కాదు. అసలు నీళ్ళు కూడా నల్లగా వుండవు.

అందుకే చిన్నగా నవ్వి అన్నాను. "అవును కథలతోపాటూ కొన్ని కవితలూ నవలలూ వ్రాశాను కదా"

"అదికాదు నేను చెప్పేది. నువ్వు కథలు అని రాసేవన్నీ కథలు కావు" ఈసారి తెల్లటి వన్నీ పాలు కాదు అన్నంత తేలికగా అన్నాడు సుబ్బారావ్.

"అంటే" అన్నాను అర్ధమయినా, కానట్టు నటిస్తూ.

"ఉదాహరణకి నీ అమెరికా బేతాళుడి కథల్లోనూ, గవర్నమెంటాలిటీ కథల్లోనూ కొన్ని కథలకి, వుండవలసిన లక్షణాలు లేవు" రెండు హైడ్రోజెన్ మాలిక్యూలనీ, ఒక ఆక్సిజెన్ మాలిక్యూలినీ కలిపితే దాని కంపోజిషన్ హెచ్‌టూఓ అవుతుందేమోకానీ తాగే నీళ్ళు మాత్రం పుట్టవన్నంత అర్ధం కాకుండా అన్నాడు

ఒకళ్ళిద్దరు సాహిత్య లాక్షణికులు, తమ మడి బట్టలు ఆరకముందు నాతో అదే మాట అన్నారు కనుక చిన్నగా నవ్వి "ఐ డోంట్ కేర్ ఫర్ ది లాక్షణికులు. నేను చెప్పదలుచుకున్నవి సూటిగా, క్లుప్తంగా కొన్ని పాత్రల ద్వారా చెబుతున్నాను. కథ తక్కువయినా కథనం వుంటున్నది కనుక వాటిని కథలు అంటున్నాను. పాఠకులకు అవి నచ్చుతున్నాయని, నాకు వచ్చేఎన్నో ఉత్తరాలు చెబుతున్నాయి" అన్నాను, గ్రహింపదగ్గవి గ్రాహ్యములు అనే అర్ధం వచ్చేటట్టుగా.

ఒక్క క్షణం ఆగి, "నీకో సలహా ఇవ్వనా?" సాలోచనగా అడిగాడు.

ఉచిత సలహా ఇస్తానన్నప్పుడు వద్దనటం ఉచితం కాదని సరేనన్నాను.

"నువ్వు కథలతో పాటూ వ్యాసాలు కూడా రాయి. కథ అంతగా లేనప్పుడు వ్యాస రూపంలో రాయచ్చు కదా" అన్నాడు వ్యాసమహర్షిలా సలహాయిస్తూ.

"అలాగే గురువర్యా" అన్నాను నవ్వుతూ.

సుబ్బారావ్ కూడా నవ్వి "నేను సీరియస్‌గానే అంటున్నాను. నువ్వు ఉద్యోగరీత్యా దేశాలు పట్టి తిరుగుతూ వుంటావు కదా. ఇంగ్లాడ్ నెదర్‌లాండ్స్ ఇజ్రాయిల్ జపాన్ కొరియా చైనా తైవాన్ సింగపూర్ ఎక్సెట్రా, అక్కడి విశేషాలు రాయకూడదూ?" అన్నాడు.

"అంటే ట్రావెలాగులా? లాగులు వేసుకునే ప్రతివాడూ వ్రాస్తూనే వున్నాడు ట్రావెలాగులు. కెనెడియన్ నేషనల్ టవర్ కెనడాలో వుందనీ, గ్రేట్ చైనా వాల్ చైనాలో వుందనీ. మళ్ళీ నన్ను కూడా అవే రాయమంటావా" నాకెందుకో సుబ్బారావ్ చెప్పిన సంహా నచ్చలేదు.

సుబ్బారావ్ ఒక్క క్షణం ఆగి, ఆలోచిస్తున్నట్టుగా రెండో క్షణం ఒక భంగిమ పెట్టి మూడో క్షణం మొదలవగానే అన్నాడు. "అది కాదు నేననేది. కల్చరల్ ఆంత్రోపోలజీ నీకు ఎంతో ఇష్టమైన సబ్జెక్ట్ అనీ, ఏ దేశమేగినా ఎందుకాలిడి నా, అక్కడి ప్రజలనీ వాళ్ళ ప్రవర్తననీ ఓ కంట పరిశీలిస్తుంటావని నాతో గొప్పగా చెప్పుకున్నావ్ కదా ఆ మధ్య. అదీకాక బిజినెస్ పని మీద వెళ్ళి రకరకాల మనుష్యుల మధ్య ఎన్నో రోజులు గడుపుతుంటావు కదా. ఆ దేశాల్లోని బిజినెస్ కండిషన్సూ, మంచీ చెడూ, ఎలా ప్రవర్తించాలో ప్రవర్తించకూడదో, ఏం మాట్లాడవచ్చో మాట్లాడకూడదో.. అందులోనూ నువ్వో టెక్నాలజీ గీక్‌వి అనుకుంటావ్‌కదా సాంకేతికంగా ఆ దేశాలు ఎలా.." బ్లాంక్‌గా వున్న నా మొఖం చూసి చెప్పటం ఆపి, "వింటున్నావా? నా బాధ నీకు అర్థమయి ఏడిచిందా అసలు?" అన్నాడు.

చిన్నగా నవ్వి "అర్థమయి ఏడిచింది సుబ్బారావూ! అందుకే ఆలోచిస్తున్నాను. నేను చూసిన, చూస్తున్న ప్రదేశాల గురించి ట్రావెలాగులగానూ, అక్కడి ప్రజల గురించీ, వారి విశేషాల గురించీ, మోనోలాగులగానూ వ్రాస్తే ఎలా వుంటుందా అని" అన్నాను.

సుబ్బారావ్ ముఖం వికసించింది. "అయితే రాస్తావన్నమాట. శుభస్య శీఘ్రం. మొదలు పెట్టు. కానీ ఈసారి కథలుగా వద్దు. చెప్పానుగా వ్యాసాలుగా రాయి" అన్నాడు వ్యాస మహర్షి వేషంలో వున్న చిత్తూరు వి. నాగయ్యలా, పెరిగిన గడ్డాన్ని నిమురుకుంటూ.

ఆ లాక్షణికుడ్ని బాధపెట్టి నేను బావుకునే లక్షలెన్నిలే అనుకుని "సరే! అలాగే వ్రాస్తాను. ఆ ట్రావెలాగులూ.. మోనోలాగులూ!" అన్నాను లక్షణంగా సోఫాలో వెనక్కి వాలి కూర్చుని.

"ఈ శీర్షికకి ట్రావెలాగులూ- మోనోలాగులూ అనే పేరుమాత్రం పెట్టకు చదువరులు చదవకపోవచ్చు. అదేదో లాగులు కుట్టే టైలరింగ్ కంపెనీ వారి బాత్రూమ్ బ్రేక్ ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లాగుంది అనుకుంటారు...."

ముళ్ళపూడి వెంకటరమణగారు, నా గవర్నమెంటాలిటీ కథలు అనే పుస్తకానికి వ్రాసిన ముందుమాటలో నా కథల్లో ఇన్‌ఫర్మేషనూ, ఎంటర్‌టైన్‌మెంటూ రెండూ నిండుగా వున్నాయని అంటూ, నాది ఇన్ఫోటైన్‌మెంటాలిటీ అన్నారు. ఈ శీర్షికకి ముందు ఇన్ఫోటైన్‌మెంట్ అని పేరు పెడదామనుకున్నాను కానీ, అది మరీ

ఆంగ్లీకంగా వుందనిపించింది. బ్రిటిష్ జెండాని తెలుగునాట ఎగరేయటం తగదనుకుని తెలుగు పేరు ఆలోచించాను. చించటం అయాక, సుబ్బారావ్‌తో అన్నాను.

"నేను ప్రవాసిని కనుకా, నేను వ్రాద్దామనుకున్న వాటిల్లో కాస్తోకూస్తో హాస్యం కనపడే అవకాశం వుంది కనుకా, ప్రవాసి ప్రహసనాలు అని పేరు పెడితే"

"మన తెల్గూ రీడర్స్ ఆఫ్ టు డే నిన్నొక వీరేశలింగం అనుకుని చదవటం మానేస్తారేమో! ఎన్నారై కబుర్లు అని పేరు పెట్టు. సింపుల్‌గానూ సుబ్బరంగానూ వుంటుంది" అన్నాడు సుబ్బారావ్.

సుబ్బారావ్ చెప్పిన పేరు అబ్బురంగా లేకుండా సుబ్బరంగానే వున్నట్టుంది. అందుకే అదే ఖాయం చేశాను. ఇలా వ్యాసరూపంలో అయితే రకరకాల విషయాల మీదా, దేశాల గురించీ, బ్రతికి మనన్ని చంపుకుతింటున్న వాళ్ళ గురించీ, చచ్చి వాళ్ళ లిపి గురుతులతో మనల్ని నడిపిస్తున్న వాళ్ళ గురించీ.. ఇలా ఎన్నో వ్రాయవచ్చు. ఆరుద్ర ఇలా చచ్చిపోయిన వారి గురించి రాసే వ్యాసాలని "వ్యాస పిండాలు" అన్నారు. ఎనీవే... ఈ ఎన్నారై కబుర్లలో ఇదే మొదటిది.

* * *

సోమవారం, సెప్టెంబర్ పదో తారీఖు (2001) ప్రొద్దున ఆఫీసు పని మీద ఆస్టిన్‌నించి శాన్‌ఫ్రాన్సిస్కోకి అక్కడినించి చైనాలోని షాంగ్‌హోయ్‌కి బయల్దేరాను.

షాంగ్‌హోయ్‌లోని ప్రాంగ్రీలా హోటల్లో దిగేసరికి మంగళవారం రాత్రి ఏడు గంటలయింది. స్నానం చేశాక, నేనూ మిత్రుడు జాన్ వాంగ్ అక్కడే లాబీ రెస్టారెంట్‌లో నూడుల్స్ తిన్నాం. ఇంతకుముందు ఆదేశం వెళ్ళినప్పుడు, చాప్ స్టిక్స్‌తో తినబోయి, ఏదీ నోటికి అందకుండా కింద పడుతుంటే మయసభలో దుర్యోధనుడిలా భంగపడ్డాను కనుక, ఈసారి ముఖమాటపడకుండా వెయిట్రెస్ అనబడే ఆ ద్రౌపదిని అడిగి ఒక ఫోర్క్ తీసుకుని, కడుపునిండా తిన్నాను.

మర్నాడు పొద్దున్న ఏడున్నర గంటలకే టాక్సీవాడిని రమ్మని చెప్పి, ఎవరి రూముకి వాళ్ళం వచ్చాం. కాస్త విశ్రాంతిగా కూర్చుని టీవీ ఆన్ చేశాను. ఒక ఛానల్లో చైనీస్ ఏక్రోబాట్స్ చూపిస్తున్నారు. ఇంకో ఛానల్లో మన ఇండియన్ సినిమాలాటి ఒక చైనీస్ సినిమా చూపిస్తున్నారు. తను చెప్పిన వాణ్ని కాకుండా కరాటే నేర్చిన హీరోని ప్రేమించినందుకు హీరోయిన్‌ని వాళ్ళ నాన్న మాండరీన్‌లో తిడుతున్నాడు.

మంచం పక్కనేవున్న ఫోనందుకుని అమెరికాలోని శ్రీమతికి ఫోన్ చేశాను.

"అమ్మయ్య. క్షేమంగా చేరావు కదా. ఇందాకటినించీ ఒకటే గాబరా పడుతున్నాను" అన్నది శ్రీమతి.

"అదేమిటి? గాబరా ఎందుకు. ఎప్పుడూ చేసే ప్రయాణాలే కదా.. "అన్నాను అర్థంకాక.

"అయితే నీకు తెలీదా? ఇందాకే న్యూయార్క్‌లో టెర్రరిస్టులు, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ని విమానంతో ధ్వంసం చేశారు. టీవీలో వస్తున్నది.... "

ఆవిడ చెబుతున్నది వింటూనే గబగబా టీవీ ఛానల్స్ తిప్పాను. సి.ఎన్.ఎన్. లో చూపిస్తున్నారు. మొదటి బిల్డింగ్ విధ్వంసం చూపిస్తుండగానే, ఇంకో విమానం

వచ్చి రెండో బిల్డింగ్‌ని గుద్దుకుంది. జనం గోలగోలగా పరుగెడుతున్నారు భయంతో బాధతో ఏం జరుగుతున్నదో ఎందుకు జరిగిందో తెలియని పరిస్థితిలో. ఆ రెండు బిల్డింగులూ నేల కూలుతున్నాయి. పై అంతస్తులలోనివారు ఏం చేయాలో తెలియక, గత్యంతరంలేక, అక్కడినించీ కిటికీల్లోనించి బయటికి దూకుతున్నారు. పిట్టలలాగా నేలకు రాలి ప్రాణాలు కోల్పోతున్నారు. అసహాయంగా కింద రోడ్డు మీద పరుగెడుతున్నవారి మీద బిల్డింగ్ కూలిపోతున్నది. ఎన్నో బాంబులు పేలుస్తున్నట్టు వస్తున్న ఆ శబ్దాల మధ్య, ఆఫీసుల్లో పనిచేసుకుందామని పొద్దున్నే వచ్చిన ఆ అమాయకుల ఆర్తనాదాలు వినపడటం లేదు. ఫోన్‌లో నేను ఏం మాట్లాడేనో గుర్తులేదు కానీ, నా చేతిలోనించి ఫోన్ జారిపోవటం మాత్రం గుర్తున్నది.

ఇటు విమానాల్లోనూ, అటు బిల్డింగులలోనూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో అమాయక ప్రాణులని బలి తీసుకున్నారు. తర్వాత పెన్సిల్వేనియాలో ఇంకో విమానం నేల కూలింది. పెంటగాన్ దగ్గర ఇంకోటి. ఒకదాని తర్వాత ఒకటి. ఎయిర్ కండిషనర్ చల్లటి గాలినిస్తున్నా నా ఒళ్ళంతా బాధతోనూ, గగుర్పాటుతోనూ, కోపంలోనూ చెమట పట్టింది.

మతం పేరుతో చేసే ఈ మారణహోమం నిజంగా ఏ మతానికి సమ్మతం? మనుష్యులుగా పుట్టి, సాటి మనుష్యుల్ని చంపి ఏమిటి వీళ్ళు బావుకునేది? ఆ అధికారం వీళ్ళకి ఎవరిచ్చారు? ఏ మతం ఇచ్చింది? స్వాతంత్రం వచ్చిన తర్వాత ఒక్క ఇండియాలోనే ఈ కారణాన ఏభై వేలమంది పైన అమాయకులని బలితీసుకున్న వీళ్ళల్లో ఏమాత్రమైనా మానవత్వం వుందా? ద్వేషంతో కూడిన ఇలాటిదురాగతాలూ హత్యలూ సభ్యప్రపంచంలో జరగవలసిన సంఘటనలా? ఏ దేవుడు ఎవరి దేవుడు ఇలాటి దురాగతాలను హర్షిస్తాడు? అసలు దేవుడి మీద నమ్మకంవున్న వాళ్ళు చేసే పనేనా ఇది?

ఈలోగా ఫోన్ మోగింది.

ఆస్టిన్‌లో మా ఆఫీస్‌నించి డిపార్ట్‌మెంట్ ఎడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ కేరెన్. నేను క్షేమంగా చేరానా లేదా అని అడగటానికి ఫోన్ చేసింది. అంతా బాగానే వుందని చెప్పాను.

"మీ గ్రూప్‌లో పని చేస్తున్నవాళ్ళల్లో, ప్రయాణాలు చేస్తున్న వాళ్ళందరికీ కాంటాక్ట్ చేశాను. అంతా క్షేమంగానే వున్నారు" అంది

ఆమెకి థాంక్స్ చెప్పి మంచం మీద పడుకున్నానే కానీ నిద్ర పట్టలేదు

"అవును మరి, రాక్షసత్వం మతం పేరుతో ఇలా మారణహోమం చేస్తుంటే ఎవరికిమాత్రం నిద్ర పడుతుంది?

* * *